# నిజమైన పతివ్రత

కొడవటిగంటి కుటుంబరావుగారు.

మనవాళ్లు పతివ్రత అనే పదం చెవికి కంటకింపు అయ్యే వరకూ అమల్లో ఉంచారు. ఇప్పటి కాలపు వాళ్లకు పతివ్రతాత్వాన్ని గురించి ఎటువంటి అభిప్రాయా లున్నవో గమనించి ఆమీద పూర్వ కాలపు పతివ్రత లెటువంటివారో ఆలోచిద్దాం. ఒక హరిదాసుగారు చెబుతూంటేగా విన్నాను—పతివ్రతలు మూడు రకాలట. మొదటి తరగతి పతివ్రత ప్రపంచంలో తన భర్త తప్ప మరి మగవాడు లేడని భావిస్తుందట. రెండో రకం ఆవిడ ఇతర పురుషు లందర్నీ అన్నలుగానూ తండ్రులుగానూ భావిస్తుందట. మూడో రకం పతివ్రత పరపురుషులమీద మనస్సు పోయినా అపుకుని తన భర్తతోనే కాలం వెళ్లబుచ్చుతుందట! పతివ్రతాత్వమంటే ఏమిటో విశద మౌతూనే ఉంది—రంకుతనం చెయ్యని మనిషి పతివ్రత!

ఇక అసలు పతివ్రతలను చూడండి! ద్రౌపదీ, సీతా, దమయంతీ, చంద్రమతీ మొదలైన వాళ్లను తీసుకోండి. అందరూ తమ భర్తలను స్వయంవరం చేసుకున్నారు, అందరూ కష్టా లనుభవించారు. చాలా మంది భర్తలనించి ఎడబాటు కూడా పొందారు. కష్టాలకు తట్టుకున్నారు. తమ భారం యావత్తూ భర్తల మీద పెట్టి "నువ్వే నా దైవం! ఏం చెయ్యమంటే అది చేస్తాను!" అనకుండా తమ ఆలోచనాశక్తి వినియోగించారు. విపరీతమైన ధైర్యం చూపించారు. వాళ్లను భర్తలయొక్క నీడ అనటం అమర్యాద అంటాను. రావణాసురుణ్ణి అంతకాలం ఒంటరిగా ఎదిరించిన సీత రాముడి నీడ ఎట్లా అవుతుంది? ద్రౌపది తన గొప్పతనం సత్యభామకు తెలుపుకునేటప్పుడు "ఏమో నమ్మ! వాళ్లనే దేవుళ్లుగా నమ్మి ఉన్నాను!" అని ఊరుకోలేదు. ద్రౌపది చెప్పుకున్న గుణాలన్నీ పతివ్రతకు అవసరమే. ఆ అయిదుగురు భర్తల భార్యను మించిన పతివ్రతలు పురాణాల్లో ఎక్కడా కనిపించరు. (పతియందు వ్రతం కలది పతివ్రత అనే ఉద్దేశంతో ఈపదం వాడటం లేదు; ఆధర్మ స్త్రీకి ఇది పర్యాయపదంగా వాడుతున్నాను)

చిత్రాంగిని తీసుకుందాం. మాటవరసకు చిత్రాంగిని సారంగధరుడి కిచ్చా రనుకుందాం. అప్పుడు చిత్రాంగి మిగిలిన మగవాళ్ల నందర్నీ ఆడవాళ్లుగా చూస్తుం దనుకుందాం (అనుకోటాని కెక్కడా కోతిగానే ఉంది!) అప్పుడు చిత్రాంగి ఉత్తమజాతి పతివ్రత అవుతుందా? కాదని నా వాదన. చిత్రాంగికి పతివ్రత కుండవలసిన స్థైర్యం, స్వతంత్రంగా ఆలోచించే శక్తీ రెండూ లేవు. జనక మహారాజు మొండికెత్తి సీతను—రాముణ్ణి వరించిన సీతను—మరొకడి కిచ్చా డనుకుందాం. అప్పుడు సీత పతివ్రత అవుతుందా? అవుతుం దనే నా నమ్మకం. రాముడి మీది ప్రేమ ఆవిడ పతివ్రతాత్వాన్ని ఒకటో మెట్టు మీదినించి మూడో మెట్టుకు తోస్తుందా? ఎప్పటికీ తొయ్యదు!

ఈకథకీ ఉపోద్ఘాతం చాలు.

* * * *

సీత కొత్తగా కాపరాని కొచ్చింది. ఆమెకింకా తన మామగారు చితికిపోయిన సంగతి తెలీదు; ఇరవై ఎకరాల మాగాణీ భూమీ, పది వేల రూపాయల కిమ్మతు ఇల్లూ మార్వాడీ అప్పు కింద తాకట్టులో ఉన్నట్టు తెలీదు. ముందు ఇంటి కొచ్చింది ఎసరు. సేటుగాడు రెండు వేలకు ఇల్లు కొట్టేయించుకున్నాడు. సీత మామగారి సహోదరుడు తెలిసి కూడా వచ్చి ఆదుకోకుండా ఊరుకున్నాడు!

"ఏమండీ? అట్లా ఉన్నారేం?" అంది సీత మొగుణ్ణి. సీత మొగుడు నిట్టూర్పి జవాబు చెప్ప

లేదు. ఆఇంటిల్లిపాదీ ఊరందరూ ఎరిగిన విషయం — సీతకు వారం పది రోజుల్లో ఎట్లాగో తెలియబోయే విషయం — సీతకు తెలియజేయటం నామర్దాగా భావించారు! మర్నాడు సీత తోడికోడలు కుండ పగలేసి "బంగారం లాంటి కొంప పోతున్నదో!" అని ఏడవటం మొదలు పెట్టింది. అందరూ కళ్ళ నీళ్ళు పెట్టుకున్నారు. ఆ రాత్రి మొగుడి దగ్గిర్నుంచి సీత సంగతంతా లాగింది.

తొలికోడి కూసే వరకూ సీత నిద్ర పోలేదు. మతి చెడకుండా ఆలోచించ గలిగితేనే ఫలం ఉంది. గుండెకి బారెడు ఎడంగా అనేక ఆలోచనలు తట్టినై. అన్నీ తోసేసి ఒక తీర్మానానికొచ్చింది. వెంటనే గాఢసుషుప్తి ఆమెను ఆవరించింది.

మర్నాడు అందర్నీ చేర్చి సీత ఆలోచన ప్రారంభించింది. వాళ్ళచేత కూడా ఆలోచింపచేద్దామని ఆమె ప్రయత్నం. కాని అందరూ మతిచెడి ఉన్నారు. అప్పుడందరితోనూ తన ఆలోచన చెప్పింది.

"నేను ఉద్యోగం చెయ్యబోతున్నాను!" అంది సీత. కల్లోలం బయలుదేరింది. ఒకరు నామర్దా అన్నారు. ఆడది ఉద్యోగం చేసి పెట్టే కన్న మాడి చస్తా మన్నాడు సీత బావగారు. ఉద్యోగం చెయ్యటం కన్నా చాటుగా లంజరికమే మెరుగన్నాడు మామగారు. సీత మొగుడు విసుగ్గా అందర్నీ నోరు మూసుకోమన్నాడు.

"ఎందుకు మాటలు చూసి బెదురుతారు!" అంది సీత.

సీత పెట్టె తీసుకుని మేనమామ దగ్గిరికి పోయి ఉద్యోగం కావాలంది. సీతకు టైప్‌రైటింగ్ చాతవును. పదిహేను రూపాయలకు దమ్మిడీ ఎక్కువివ్వనన్నాడు. ఆయనదో రకం మనిషి. సరేనంది సీత. సీత ఉత్తరం అందగానే మొగుడు వచ్చేశాడు. అతనికి కూడా సీత మేనమామ ఆ ఇన్స్యూరెన్స్ కంపెనీ తరఫున కాన్వాసర్‌గా ఉండటానికి అనుజ్ఞ ఇచ్చాడు. ఇద్దరి సంపాదనతో కూడా గడవటం బహు కష్టమయింది. పత్రికలకు సీత వ్యాసాలు రాసి ధనార్జన చెయ్యాలని చూసింది. కానిఅదీ ఎక్కువ జయప్రదం కాలేదు.

తరవాత సీత ఆవూళ్లో ఒక నాటకసమాజం ఉంటే దాన్లో వేషాలు వెయ్యటానికి పూనుకుంది. కొంతకాలం అది చాలా లాభించింది కాని సీత చనువుగా మాట్లాడటం మరోవిధంగా తీసుకుని కంపెనీ ప్రొప్రయిటరు గారు కొత్త కండిషనులు మాట్లాడబోయినాడు. సీత నవ్వి "క్షమించండి! నేను చాలా పూర్వకాలపు దాన్ని!" అంది. ఆ రోజుతో ఆ ఉద్యోగం అయిపోయింది.

డబ్బు సంపాదించటానికి సీత చాలా ప్రయత్నాలు చేసింది కాని ఎక్కడికి పోయినా మగవాళ్ళు ఒకటే యావగా కనిపించింది. ప్రపంచంలో ఇంత మంది బాలెన్సు లేని మగవాళ్ళున్నారని సీత ఎరగదు.

అనుకోని అదృష్టంగా సీతకు టాకీల్లో నటించే అవకాశం గ్రామఫోను కంపెనీ వారికి రికార్డులిచ్చే అవకాశం ఒక్క సారి వచ్చినై.

"నాకు పాడటం గాని నటించటం కాని చాతవునని నాకింతవరకూ తెలీదోయ్ — వాళ్లు పిలిచేదాకా!" అన్నది సీత నవ్వుతూ నేను మొన్న ఆమెను కలుసుకుని మాట్లాడినప్పుడు. "మగవాళ్ళకు ఆలోచనాశక్తి లేదబ్బాయి. నన్ననేకమంది మగవాళ్లు వెంటాడారు. అటువంటివి ఇష్టం లేనప్పుడు అప్పట్లే జయిపోయి మూర్ఛపోవటం అవివేకం. ఎవడో దార్నిపోయే పోకిరాయి కన్నుకొట్టటానికి మన మంచితనంతో ఏమీ సంబంధం కనిపించదు! అటువంటి వాటికి నావంటి ఆడది సంసిద్ధురాలై ఉండటమే కాక ఇంకోరి సహాయం కోరకుండా తట్టుకు రావాలి!"

సీతనూ మొగుణ్ణీ అత్తవారు చాలా కాలం కిందటే వెలేశారు! సీత మామగారు గౌరవంగా బతకగలందులకు ఒకటి తరవాత ఒకటి దొంగెత్తులు వేస్తూన్నట్టు తెలుస్తుంది!